క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈనెల 24న నంద్యాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న అనిత, అండర్- 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు మౌనిక, గిరివర్ధన్ ప్రతిభ చాటడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం షేక్అహ్మద్, ఉపాధ్యాయులు షఫీ, వెంకటేశ్వరమ్మ, షర్మిల, దామోదరరావు, రాజేశ్వరీదేవి, వెంకటప్రసాద్ అభినందించారు.

యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలి



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ

హాలహర్వి: యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గూళ్యం గ్రామంలోని వాసవీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌ను తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. దాదాపు 3.825 టన్నుల యూరియా అమ్మకాలను నిలిపివేసినట్లు చెప్పారు. మండలంలోని డీలర్లు యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక పూజలు




ప్రత్యేక అలంకరణలో గాయత్రీ మాత, పెద్దమ్మవ్వ

ఆస్పరి: మండల కేంద్రంలో వెలసిన మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి



ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దేవనకొండ: విద్యాలయాలు ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు బి.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దేవనకొండలో కర్నూలు-పత్తికొండ రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి సమీపంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఎఫ్ఆర్ హైస్కూల్ ఉన్నాయన్నారు. మద్యంషాపు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మధు, సురేంద్ర, భరత్, రవితేజ పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వేరుశనగ రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

దేవనకొండ: రైతులు సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ సురేష్ బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల, నెల్లిబండ గ్రామాల్లో డీఆర్‌సీ ఏఓలు మాధురి, హేమలత రబీలో భాగంగా సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. 20 రోజుల పంట కాలంలో వేపనూనె 2.5 ఎం.ఎల్. లీటర్ నీటిలో కలుపుకుని, అసిఫేట్ 2.5 గ్రాముల నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. విత్తిన 35 రోజుల తర్వాత ఎకరాకు 100 కిలోల జిప్సం పంట పైన చల్లుకోవాలన్నారు. ఆకుపచ్చ పురుగు, లద్దె పురుగు నివారణకు క్లోరోపైరిపాస్ 2.5 ఎం.ఎల్, మోనోపాస్ 2.0 ఒక లీటర్ వాట్ కలిపి పిచికారీ చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలని చెప్పారు.

కొండ పండు..ఉపాధి మెండు

- పలువురికి ఉపాధి కల్పిస్తున్న సీతాఫలం
- కొండల నుంచి తెచ్చి విక్రయిస్తున్న పల్లె జనం
- ఆలూరు, హాలహర్వి, ఆస్పరి, హొళగుంద మండలాల్లో విస్తృతంగా లభ్యం
- నాలుగు నెలలపాటు ఉపాధికి కొదువుండదంటున్న స్థానికులు



హాలహర్వి బస్టాండులో సీతాఫలాలను విక్రయిస్తున్న మహిళ



ఆలూరులోని బస్టాండు ప్రాంతంలో సీతాఫలం పండ్లను విక్రయిస్తున్న మహిళలు

హాలహర్వి: ప్రకృతి సిద్ధంగా పండే పండ్లలో ప్రథమ స్థానంలో నిలిచేది సీతాఫలం. ఈ పండు సహజంగా కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఆలూరు నియోజకవర్గంలో కొండలు అధికంగా ఉన్నాయి. దీంతో వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు కొండల సమీపంలోని గ్రామాల ప్రజలు కొండకెళ్లి పండ్లను కోసుకొని వివిధ ప్రాంతాల్లో విక్రయించుకుని ఆదాయం పొందుతున్నారు. ప్రకృతి నుంచి ఉచితంగా ఎలాంటి మందులు, సాగు పద్ధతులు, సస్యరక్షణలు చేపట్టాల్సిన అవసరం లేకుండా ప్రతి సీజన్‌లో సహజంగా మొలచిన ఈ పండ్ల చెట్ల నుంచి పండ్లు విరివిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ పండ్లు చాలా మధురంగా ఉండటమే కాకుండా నాణ్యతగా ఉంటాయి. సాగు చేసిన పండ్లను వివిధ పద్ధతుల్లో మాగబెట్టాల్సి వస్తుంది. వీటిని మాత్రం కాయలను తెంపి గంపలు, గోనెసంచులపై ఉంచి కాటన్ వస్త్రం కప్పి ఉంచితే చాలు పక్వానికి వస్తాయి. ఇవి మాగిన తరువాత వచ్చే వాసన చాలా బాగుంటుంది. ఇళ్లల్లో అయితే ఏ మూలన ఉంచినా ఇళ్లంతా వాటి వాసన వ్యాపిస్తుంది. ఈ ప్రాంతంలో విరివిగా లభించే ఈ అమృత ఫలాన్ని కస్టర్డ్ యాపిల్, షుగర్ యాపిల్ తదితర పేర్లతో పిలుస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో గంపకు రూ.500 నుంచి రూ.800 వరకు ధర లభిస్తుంది. పెద్ద గంపల్లో 80-100 వరకు పండ్లుంటాయి. చిన్న గంపల్లో 40-50 పండ్లు ఉంటాయి. సైజు బాగుండే పండ్లు తక్కువ వస్తాయి. అయినా మంచి ధర లభిస్తుంది.

మండలంలో..

మండలంలోని విరుపాపురం, బల్లొట, కుర్లేహళ్లి, బిలేహాల్, నిట్రవట్టి కొండల్లో సీతాఫలం దొరుకుతాయి. అలాగే రహదారుల వెంబడి గంపలను పెట్టుకుని అటుగా ప్రయాణించే వారికి విక్రయిస్తుంటారు. అలాగే హొళగుంద, ఆలూరు, ఆస్పరి మండలాల్లోని గ్రామాలకు చెందిన వారు వీటిని ఎక్కువగా హొళగుంద మండలం దేవరట్టు కొండలోని సమీప అడవుల్లో సేకరించి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరలిస్తారు. ఆలూరు, హాలహర్వి, ఆస్పరి మండల కేంద్రాల్లోని బస్టాండుల్లో గంపల్లో పండ్లను ఉంచి విక్రయిస్తారు. ఒక్కో గంప ఫలాలకు రూ.500 నుంచి రూ.800 దాకా విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

పోషకాలు అధికం..

సీతాఫలం ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. 100 గ్రాముల గుజ్జు నుంచి 84 క్యాలరీల శక్తి, 20 నుంచి 25 గ్రాముల పిండి పదార్థాలు, 25 గ్రాముల ప్రొటీన్లు, 4.4 గ్రాముల పీచు లభ్యమవుతుంది. మాంసకృత్తులు, 0.8 నుంచి 1.5 గ్రాముల చక్కెర గ్లూకోజ్ రూపంలో, 20 నుంచి 22 కొవ్వు పదార్థాలు, 0.30 క్యాల్షియం, 0.02 ఐరన్, పోషక విలువలు ఉండడంతో ఆరోగ్యానికి చాలా మంచిదని, ఇంకా కెరోటిన్, థైమిన్ లాంటివి సమృద్ధిగా లభిస్తాయి.

మహిళలకు ఉపాధి..

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నాలుగు నెలల పాటు లభించే సీతాఫలాలను ఈ ప్రాంత ప్రజలు ఉదయాన్నే కుటుంబ సమేతంగా ముఖ్యంగా మహిళలు అడవుల్లోకి వెళ్లి సేకరిస్తారు. వాటిని కొందరు రోడ్ల పక్కన పెట్టుకొని విక్రయిస్తుండగా.. మరికొందరు వివిధ ప్రాంతాలకు ముఖ్యంగా కర్ణాటకలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఆదోని, ఆలూరు, పత్తికొండకు తీసుకెళ్లి విక్రయిస్తారు. ఈ సీజన్‌లో రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు మిగులుతుందని పలువురు చెబుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకుంటాం

మాది నిట్రవట్టి గ్రామం. మా ఊరి దగ్గర ఉన్న కొండలు, దేవరగట్టు కొండల్లో ఎక్కువగా సీతాఫలం పండ్లు లభిస్తాయి. వాటిని తెంపుకుని కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, మోకా, ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు, ఆదోని ప్రాంతాల వైపు వెళ్లి అమ్ముకుంటాం. మూడు నుంచి నాలుగు నెలల పాటు సీజన్ ఉంటుంది. ఊర్లోని అధిక శాతం మంది వీటి విక్రయించి ఉపాధి పొందుతారు. నాలుగు నెలల పాటు మాకు ఉపాధికి కొదువుండదు.

– బోగి రామలింగప్ప, నిట్రవట్టి



మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది

మాది విరుపాపురం గ్రామం. మా గ్రామం వద్ద కొండలో దొరికే సీతాఫలం కాయలను తెంపుకుని కొద్ది రోజులు నిల్వ ఉంచుకుంటాం. మాగిన తర్వాత వాటిని మార్కెట్‌కు తరలిస్తాం. గంపకు రూ.500 వస్తుంది. ఈ పండ్లను మా గ్రామంలోని మహిళలు కూడా తెంపుకుని అమ్ముకుంటున్నారు. వారు కూడా ఉపాధి పొందుతున్నారు.

– నీలకంఠ, విరుపాపురం



పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించండి

పత్తికొండ(తుగ్గలి) : రబీ సీజన్ 2024-25 పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతు సేవా సిబ్బందికి పంటలకు ఆశించే తెగుళ్లు, నివారణపై జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు వేదమణి, ఉద్యానవన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక శిక్షణ ఇచ్చారు. ఉల్లి, మిరప పత్తి, టమాట పంటలను ఆశించే తెగుళ్లు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటల బీమా పథకానికి రైతులే స్వచ్ఛందంగా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. డిసెంబర్ 31లోగా బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ ఆయా బ్యాంకులు ప్రీమియం మినహాయించుకుని బీమాకు మొత్తం చెల్లిస్తారన్నారు. సొంత పెట్టుబడితో పంటలు సాగు చేస్తున్న రైతులు మాత్రం సీఎస్‌సీ సెంటర్లు, గ్రామ సచివాలయాల్లో ప్రీమియం చెల్లించవచ్చన్నారు. టెక్నికల్ ఏఓ మునెమ్మ, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు, రైతు సేవా సిబ్బంది, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ఆలూరు: నాటుసారా తయారీ, మట్కా నిర్వాహకులపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు ఎస్ఐ సి.వి.నరసింహులు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని మట్కా, నాటుసారా తయారీదారులపై ఇప్పటికే 190 మందిపై కేసులను నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ ఫ్యాక్షన్ తగాదాల్లో తల దూరుస్తున్న 40 మందిని బైండోవర్ చేశామని, మరికొందరిని రౌడీ షీటర్లుగా గుర్తిస్తున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడుతూ, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారిపై సెల్: 9121101158 నంబర్‌కు సమాచారాన్ని చేరవేయాలని కోరారు.

ఉత్తమ సేవకు అవార్డు



స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

హొళగుంద: ఆలూరు సర్కిల్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఎర్రిస్వామి, అక్బర్‌బాషా శుక్రవారం కర్నూలులో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నుంచి ప్రశంసలు పొందారు. వీరు ఈ నెల రెండవ వారంలో జరిగిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో భాగంగా రాజకీయ పార్టీల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు చోటుచేసుకోలేదు. వీరి సేవలను గుర్తించిన జిల్లా ఎస్పీ శుక్రవారం కర్నూలులో ఇద్దరికీ ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కాగా ఎర్రిస్వామి ప్రస్తుతం ఎస్‌బీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

యురేనియం తవ్వకాలు చేపట్టొద్దు



డీఎఫ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామ పరిధిలో 400 ఎకరాల రిజర్వ్ ఫారెస్టు, వ్యవసాయ భూముల్లో యురేనియం తవ్వకాలను చేపట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డీవీఎంసీ సభ్యుడు కాకర్ల శాంతకుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులో డీఎఫ్ఓ శ్యామలను కలిసి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీంతో కప్పట్రాళ్లతో పాటు సమీపం గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా మండలంలోని హంద్రీనీవా కుడి కాలువ ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పుడిప్పుడే రైతులు వ్యవసాయంలో రాణిస్తున్నారని, వ్యవసాయమే ఆధారంగా ప్రజలు జీవిస్తున్నారన్నారు. యురేనియం తవ్వకాలతో వారి జీవనం చిన్నాభిన్నమవుతుందని చెప్పారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి



హొళగుంద ఎంపీడీఓ కార్యలయంలో ఆధార్‌కేంద్రం నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, పోతుగల్లు, ఆలంకొండ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను శుక్రవారం పరిశీలించారు. ఈ గ్రామాల్లో రెండు రోజులు ఆధార్ సేవలు అందించామన్నారు. కొత్త ఆధార్‌కార్డుల కోసం, బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్‌ల మార్పులు, చేర్పులు, వయస్సు తేడా ఉన్నా, అలాగే పేరు మార్పు, ఫోన్ నంబర్ అప్‌డేట్ సేవలు డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా అందించామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు అందజేశామని చెప్పారు

హొళగుంద: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను మరో పది రోజులు పొడిగించాలని తుంగభద్ర రైతు సంఘం గౌరవాధ్యక్షుడు గాజీ వీరభద్రగౌడ్, నాయకులు పాలాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ హొళగుందలో నాలుగు రోజుల నుంచి ఆధార్ కేంద్రం నడుస్తున్నా ప్రజలకు సరైన సమాచారం లేకపోవడంతో చాలా మంది ఆధార్ సెంటర్ సేవలను వినియోగించుకో లేకపోయారన్నారు. అయితే కేంద్రం గడువు శుక్రవారం ముగియడంతో చాలా మంది సేవలకు దూరమై ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వచ్చిన వాళ్లకు కూడా సర్వర్ పనిచేయకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా ఆధార్ అప్‌డేట్, న్యూ ఎంట్రీలను చేసుకోలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాధికారులు స్పందించి మరో పది రోజులు కొనసాగించాలని కోరారు.

నిలకడగా టమాట ధర

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ మార్కెట్‌యార్డులో శుక్రవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.33, కనిష్ఠంగా రూ.18, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది. వారం రోజుల నుంచి రైతులకు మంచి ధర లభిస్తుందని పలువురు అన్నదాతలు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మద్దికెర : సీజనల్ వ్యాధులు, వాతావరణ మార్పులపై అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక వైద్యశాలలో సిబ్బందికి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, అతిసారాతో పాటు వాతావరణ మార్పులు, వాటి పరిణామాలపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, నీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు. పరిసరాల్లో మురుగునీరు నిల్వ వుండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది సరస్వతి, కృష్ణమ్మ, సూర్యనారాయణ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు

పత్తికొండ(తుగ్గలి) : ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. శుక్రవారం పత్తికొండ నుంచి తుగ్గలి వైపు వెళ్తున్న ఆటోను మార్గమధ్యలో మిట్టబండ సమీపంలో వెనుక వచ్చి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో వెళ్తున్న పత్తికొండకు చెందిన కొండపల్లి రంగమ్మ, రాతనకు చెందిన లక్ష్మయ్య, తిప్పన్న గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్ష్మయ్యను కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పత్తికొండ పోలీసులు తెలిపారు.

మొక్కలు పెంచి సంరక్షించాలి



మొక్క నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపాల్ సి.నరసింహులు

ఆలూరు: పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి విద్యార్థి మొక్కలు నాటి సంరక్షించాలని అరికెరలోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సి.నరసింహులు సూచించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు సొంత ఖర్చులతో జేసీబీతో శుభ్రం చేయించారు. అనంతరం ఖాళీ స్థలంలో వేప, చింత, మునగ మొక్కలను నాటి నీరు పోశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో త్వరలో టమాట, జామ, ఆకు కూరలు పెంచుతామన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మనోజ్‌రాజ్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి



ఆలూరులో పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుగ్గలి : జాతీయ స్థాయి పశుగణనలో కచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్పయాదవ్ అన్నారు. పశువైద్యాధికారి బాలకృష్ణతో కలిసి శుక్రవారం జొన్నగిరిలో పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ..ఈ గణాంకాల ఆధారంగా పశుసంవర్ధక శాఖ ద్వారా పథకాల రూపకల్పన, పాడిపశువులకు అవసరమైన వైద్యం, ఇతర సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. మూగజీవాలకు ఎప్పటికప్పుడు వైద్యం, ఇతర సదుపాయాలు, మందుల బడ్జెట్, టీకాలు అందించేందుకు ఈ లెక్కలే ఆధారమవుతాయన్నారు. రైతులు, ప్రజలు ఎన్యూమరేటర్లకు పక్కాగా సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్ పీర్‌బాషా పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం ఆలూరు పశుసంవర్ధ శాఖ ఏడీఏ డాక్టర్ విక్టర్ సమక్షంలో పశుగణన పోస్టర్లును ఎంపీపీ జెట్టప్పగారి రంగమ్మ విడుదల చేశారు.ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి, మొలగవెల్లి గ్రామ పశువైద్యాధికారి నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓతో సమావేశమై గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని సూచించారు.

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పశువైద్యాధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నగేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు మండలంలోని 8,400 ఇళ్లల్లో ఉండే పశువులు, ఇతర జీవులను లెక్కిస్తామన్నారు.

హొళగుంద: పశు సంరక్షణ కోసం నేటి నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు తలపెట్టిన 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమానికి రైతులు, పశుపోషకులు పూర్తి వివరాలిచ్చి సహకరించాలని పశువైద్య సహాయాధికారి జిలాన్‌బాషా కోరారు. శుక్రవారం ఆయన కోగిలతోట గ్రామంలో పశుగణన కార్యక్రమం ప్రారంభంలో భాగంగా గ్రామపెద్దలు, రైతులతో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



పెద్దగోనెహాళ్‌లో మాట్లాడుతున్న డీటీ నిజాముద్దీన్

వెల్దుర్తి(కృష్ణగిరి): భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు చేపట్టినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ తెలిపారు. మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రీ సర్వే జరిగిన భూములకు సంబంధించి అడంగల్ ఎంట్రీలో పొరపాట్లు, కొలతలు, విస్తీర్ణంలో తేడాలు మొదలైన సమస్యలను గ్రామసభల దృష్టికి తీసుకరావాలన్నారు. ఫిర్యాదులు అందజేసిన ప్రతి రైతు సమస్యను పరిష్కరించే ఒదుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో శుక్రవారం రీ సర్వే పై గ్రామసభ జరిగింది.గతంలో జరిగిన రీ సర్వేలో తేలిన అంశాల పై అభ్యంతరాలు, ఇతర భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సతీష్ తెలిపారు. రీ సర్వే తర్వాత విస్తీర్ణం విషయంలో ఎక్కువ సమస్యలు తలెత్తాయని, ఆన్‌లైన్ అడంగల్‌లో భూముల విస్తీర్ణం హెచ్చుతగ్గులు, ఇతర భూ సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని 150 మంది రైతులు అర్జీలు సమర్పించారు. డీటీ నిజాముద్దీన్, సర్వేయర్ డీటీ ముకుందరావు వీఆర్‌ఓలు నాగరాజు, ప్రహ్లాద, దామోదర, సూరంజనేయులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

హాలహర్వి: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుండాలని ఎంపీడీఓ వరలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్లె పండగ వారోత్సవాల్లో ఆయా గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు సూచించారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ నాగేష్, ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి, ఏపీఎం శివయ్య, మండల పశువైద్యాధికారి అశోక్, ఏఓ శివశంకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన నష్టం



మద్దికెర సమీపంలో శనగ పొలంలో నిలిచిన వర్షపు నీరు



బెల్డోణలో నేలకొరిగిన జొన్న పైరు



నంచర్లలో తడిచిన ఉల్లిగడ్డలు



మద్దికెర వద్ద నీటమునిగి కుళ్లిన పప్పుశనగ పైరు

మద్దికెర : మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రబీలో సాగు చేసిన పంటలు మొలకెత్తక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి విత్తనం వేస్తే తుపాను ప్రభావం వల్ల తేమ ఎక్కువై విత్తనాలు మొలకెత్త లేదు. దీంతో తమ ఆశలు నిరాశలయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు వేసి 20 రోజులు గడుస్తున్నా మొలక రాకపోవడంతో మరోమారు విత్తనం వేయాల్సి వస్తుందన్నారు.

చిప్పగిరి:మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల కేంద్రంతో పాటు నేమకల్లు,నగరడోణ,రామదుర్గం,బెల్డోణ,తదితర గ్రామాల్లో జొన్న ,పత్తి,కొర్ర,సజ్జ,కంది,ఉల్లి గడ్డ,పప్పుశనగ, వేరుశనగ పంటలు సాగు చేశారు. రెండు రోజులుగా కురిసన వర్షాలకు బెల్డోణ,నేమకల్లు గ్రామాల్లో వేసిన జొన్న పైరు నేల కొరిగింది. పలు గ్రామాల్లో పంట పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయి పైర్లు కుళ్లిపోతున్నాయి.